క్లుప్తంగా

నేడు ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, నటసార్వభౌమ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని బహదూర్‌పల్లి చౌరస్తాలో ఈనెల 24న ప్రతిష్టించనున్నట్లు ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు, పార్టీలకు అతీతంగా నాయకులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న రోటరి క్లబ్ సిబ్బంది

జగద్గిరిగుట్ట: జగద్గిరినగర్ మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో రోటరి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ ఆధ్వర్యంలో నెల పాటు సాగిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. గత నెల 24 తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు కుట్టు, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్‌లలో శిక్షణ ఇచ్చారు. వేసవిలో పిల్లలు ఎంతో ఆసక్తితో ఆ శిక్షణలో పాల్గొని మెళకువలు నేర్చుకున్నారు. ఇక్కడ నేర్చుకున్నది ఖాళీ సమయాల్లో ప్రాక్టీస్ చేయాలని రోటరి క్లబ్ ఆఫ్ డెక్కన్ సెక్రటరీ అను కెంద్రీ అన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

బధిరులకు వినికిడి పరికరాల అందజేత

కుత్బుల్లాపూర్: స్వచ్ఛంద సంస్థలు బధిరులకు ఉచిత వినికిడి పరికరాలు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్‌లోని ఆశ్రయ్ ఆకృతి హియరింగ్ క్లినిక్‌లో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో 25 మంది ఉచిత వినికిడి పరికరాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్, ఆశ్రయ్–ఆకృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డీపీకే బాబు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని తొలగించడం హేయమైన చర్య

సుభాష్‌నగర్: బస్తీ అభివృద్ధి పనుల కోసం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ఓ వ్యక్తి తన ఇంటి ముందు అడ్డుగా ఉందని తొలగించడం హేయమైన చర్య అని స్థానికుడు గడ్డం ప్రసన్నకుమార్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని 18వ వార్డులో గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు నూతన రోడ్డు నిమిత్తం అప్పటి కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. కొన్నేళ్లుగా ఉన్న శిలాఫలకం మంగళవారం ఉదయం లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వ్యక్తి తన సొంత ప్రయోజన కోసం శిలాఫలకాన్ని తొలగించినందుకు అతనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విత్తన కంపెనీల్లో తనిఖీలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర సీడ్స్ టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం సైతం విత్తన కంపెనీల్లో తనిఖీలు చేపట్టింది. ఏడీఏ సుధాకర్ బాబు, మేడ్చల్ ఎస్‌ఓటీ సీఐ జేమ్స్‌బాబు, సీడ్స్ సర్టిఫైడ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్, ఉప్పల్, ఘట్‌కేసర్ మండలాల వ్యవసాయాధికారులు సుధారాణి, బాసిత్, రవికుమార్‌లతో కూడిన బృందం కొంపల్లి, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న లోర్వన్ సీడ్స్, రాశీ సీడ్స్, టయో సీడ్స్, శ్రీసత్య సీడ్స్, లక్కీ సీడ్స్, శ్రీసాగర్ సీడ్స్, కాకతీయ సీడ్స్ తదితర కంపెనీల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా గోదాముల్లో సీడ్స్ స్టాక్‌ను, రిజిస్టర్‌లో నమోదు తదితర విషయాలను పరిశీలించారు.



ఓ విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్ర సీడ్స్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

అధికారులూ.. ఈ సమస్యలపై ఓ లుక్కేయ్యండి!

● నియోజవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు ● ఎప్పుడు పరిష్కరిస్తారని వేచి చూస్తున్న ప్రజలు

జనావాసాల మధ్య రసాయన డ్రమ్ములు..



సుభాష్‌నగర్: పారిశ్రామికవాడలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. చాలా సందర్భాల్లో ప్రమాదం అనంతరం విచారణ చేపట్టిన అధికారులు పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. ఇలాంటి అనుమతి లేని పరిశ్రమలో జనావాసాల మధ్య మరెన్నో నడుస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. సూరారం డివిజన్ లక్ష్మీనగర్ స్థానికంగా ఇదే తరహాలో ఓ వ్యక్తి పైపుల తయారీకి ఉపయోగించే రసాయన డ్రమ్ములను జనావాసాల మధ్య ఉంచుతున్నాడు. అధికారులు స్పందించి డ్రమ్ములను తరలించాలని కోరుతున్నారు.

పీసీబీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోరు..

జీడిమెట్ల: రాత్రివేళల్లో పరిశ్రమల నుంచి వెలువడే పొగతో అపురూపాకాలనీ, ఎస్‌ఆర్ నాయక్ నగర్, సాయిబాబానగర్, దుర్గాకాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నల్లటి పొగలు ఇళ్లల్లోకి వస్తుండటంతో ఇంటి లోపల నల్లటి దుమ్ము కణాలు పడుతున్నాయి. కొన్నిసార్లు రాత్రిపూట శ్వాసతీసుకోవడానికి సైతం ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. పరిశ్రమల్లోని పొగ గొట్టాలు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కాని కొన్ని పరిశ్రమలు నిబంధనలు పాటించకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు వచ్చి చూసి వెళ్లున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పొగలను వదిలే పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాత్రిపూట ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

నీటిని వృథా చేయకండి..



సోమయ్యనగర్ ప్రధాన రహదారిలో పారుతున్న నీరు

జగద్గిరిగుట్ట: 'మేమింతే.. మేం మారం'అన్నట్లు వ్యవహరిస్తున్నారు నీటి వినియోగదారులు. నీటి సరఫరా అయ్యే క్రమంలో ఇంట్లో ఉన్న సంపు నిండిన తర్వాత నీటిని రోడ్లపై వదులుతున్నారు. సంపు నిండిన తర్వాత నీటి సరఫరాను బంద్ చేయడానికి వాల్వ్ కూడా బిగించుకోకపోవడం విడ్డూరం. తాగునీరు సరఫరా అయిన ప్రతిసారి కాలనీరోడ్లపై వృథాగా పోతోంది. ఈ నీటి వృథాను అరికట్టడానికి జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ధ్వంసమై 5 నెలలైంది..

చింతల్: గాజులరామారం డివిజన్‌లోని శ్రీరాం నగర్ బస్తీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమై 5నెలలయ్యింది. ఇప్పటి వరకు జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పక్కనే ఉన్న ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు పైప్‌లైన్ మార్గంలో వెళ్లే దారి లేకపోవడంతో పక్కనే ఉన్న ఇళ్లలోనే పేరుకుపోతోంది. దీంతో మురుగు రోడ్డుపై పారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు, సంబంధిత సెక్షన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.



శ్రీరామ్‌నగర్‌లోని ఓ గల్లీలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

విద్యుత్ స్తంభం.. ప్రమాదకరం



చింతల్: డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీలో ఉన్న విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాకాలంలో వచ్చే ఎదురుగాళ్లకు ఎప్పుడు నేలకొరుగుతాయోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ స్తంభాలకు సపోర్టింగ్‌గా మరో స్తంభాన్ని తీసుకొచ్చి నాటుతున్నారు. కాని దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వాకర్స్ ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి బల్బులను అమర్చాలని కోరుతున్నారు.

రోడ్డును ఇలాగే వదిలేయకండి..



నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ఆదిత్యకాలనీలో ఇటీవల భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. తర్వాత సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి రోడ్డు గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిదులు రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

'సమస్యలను లేవనెత్తకుండా కేసీఆర్, కేటీఆర్‌ల జపం చేస్తున్నారు'

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సామాన్య జనం బతకలేని పరిస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన 'కుత్బుల్లాపూర్ గోస – కూన శ్రీశైలంగౌడ్ భరోసా'యాత్రలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో పర్యటించారు. గణేష్‌నగర్, కల్పన సొసైటీ, పద్మానగర్ ఫేజ్–1లలో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కరెంట్, ఆర్టీసీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, నల్ల బిల్లులు అన్ని పెరిగాయని అన్నారు. పేదలకు కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రజా సమస్యలను లేవనెత్తకుండా కేసీఆర్, కేటీఆర్‌ల జపం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, సీనియర్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, నటరాజ్‌గౌడ్, కృష్ణయాదవ్, దయాకర్, లింగం యాదవ్, అలివేలు, దుర్గారావు, వెంకటేష్ యాదవ్, సత్యం, భూషణం తదితరులు పాల్గొన్నారు.



గణేష్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



బాధితులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రజలతో మాట్లాడుతున్న శంభీపూర్ రాజు

దుండిగల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సుందర్ నగర్‌కు చెందిన టి.కవిత, ఎల్.నాగలక్ష్మి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉండడంతో శంభీపూర్ రాజును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 3.5 లక్షలను మంజూరు చేయించారు. కవితకు రూ 1.5 లక్షలు, నాగలక్ష్మి కి రూ రెండు లక్షలు చొప్పున ఎల్‌ఓసి పత్రాలను మంగళవారం బాధితులకు అందజేశారు. దీనికి వారు ఆయనకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటికే ఎంతోమంది నిరుపేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందారని శంభీపూర్ రాజు పేర్కొన్నారు.

శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై ఆయనకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది'

నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలంలో మాట్లాడుతున్న ఆకుల సతీష్

నిజాంపేట్: కార్పొరేషన్ అధికారుల వైఖరితో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉందని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్వే నం.233/1లోని ప్రభుత్వ భూమి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన వాసం వెంకటేశ్వర్లు ఎల్‌ఆర్ నం.886/2020 ఉత్తర్వుల ద్వారా 233/లోని నాలుగు ఎకరాల 19గుంటల ప్రభుత్వ భూమికి పంచనామా చేసి కార్పొరేషన్‌కు అప్పగించామన్నారు. అయితే కొందరు వ్యక్తులు సదరు స్థలం తమకు చెందినదిగా పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్లు వేశారని, కాని మున్సిపల్ అధికారులు కౌంటర్ దాఖలు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

అనుమతులు ఇచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలి..

◆ ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా కాజేసేందుకు మేయర్ భర్త గోపాల్‌రెడ్డి వెనుక ఉండి చక్రం తిప్పాడని, స్థానిక కార్పొరేటర్ ముందుండి తతంగం నడుపుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన స్థలంలో నిర్మాణాలకు అనుమతిచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీని వెంటనే తక్షణమే సస్పెండ్ చేసి కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి జీవో 58, 59ల కింద క్రమబద్ధీకరించేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

దొంగే దొంగ.. దొంగ అన్నట్లుగా మేయర్ భర్త విమర్శలు

◆ దొంగే దొంగ.. దొంగ అన్నట్లుగా ప్రెస్‌మీట్ పెట్టి మేయర్ భర్త బీజేపీ నాయకులపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికార పార్టీ అక్రమాలు, అవినీతిని ప్రజాక్షేత్రంలో పెట్టి రాబోయే ఎలక్షన్లలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశి, కార్పొరేషన్ కార్యదర్శి ప్రసాద్, సత్యనారాయణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, ట్రేడర్స్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాధవరావు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అరాచకాలపై ప్రచారం చేయాలి

మెదక్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

రంగారెడ్డినగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అవినీతి, అరాచకాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రంగారెడ్డినగర్‌లోని శివాజీ చౌక్ చౌరస్తాలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడి మే 30వ తేదీ నాటికి తొమ్మిదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు చేరువయ్యేందుకు 'జన సంపర్క్ అభియాన్'కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సమాజంలో వెనుకబడిన అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తుందన్నారు. ప్రపంచ వేదికపై భారత దేశం తనదైన ముద్ర వేస్తోందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు ఈ అభియాన్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో కార్యకర్తల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశం సాధించిన విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

◆ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ కుటుంబ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. కల్లబొల్లి మాటలు చెబుతూ మభ్యపెట్టే కేసీఆర్ పాలనకు చిమర గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు, నిజామాబాద్ ఇంఛార్జి గానుగ శ్రీనివాస్, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు పరుష వేణు, గీత కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ రంగా శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యదర్శి సంజీవ్ పాల్గొన్నారు.

27న పరేడ్ గ్రౌండ్‌లో యోగా బ్రహ్మోత్సవం

సుభాష్‌నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవా (జూన్ 21న)న్ని పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్‌లో యోగా బ్రహ్మోత్సవం పేరిట 25 రోజుల కౌంట్‌డౌన్ యోగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు యోగా గురువు కె.రవీందర్‌రాజు పేర్కొన్నారు. ఈ వేడుకలకు జీడిమెట్ల గ్రామంలో శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ వారం రోజుల నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు. ఈనెల 27న ఉదయం 5.30 నుంచి 7.30 వరకు నిర్వహించే ఈ యోగాలో వేలాది మంది పాల్గొంటారని తెలిపారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఫోన్ నం.93963 78418లో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని.. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం బాగు పడిందే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్–బీ, బేకరీగడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీలను ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలుగా మారుస్తామన్నారు. అంతేకాకుండా ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్‌లలో నూతన ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీల ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేమ్స్, జహంగీర్, సంజీవరెడ్డి, రాజశేఖర్, రషీద్, వెంకటేష్ , గణేష్, లాయక్, రాహుల్, శ్రీనివాస్ గుప్తా, రాధా, శారదా తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మతల్లి ఆలయ నూతన కమిటీ

దుండిగల్: బౌరంపేటలోని శ్రీబంగారు మైసమ్మతల్లి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.రంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎర్రోల జంగారెడ్డి, కొమ్ము జీవన్, ప్రధాన కార్యదర్శులుగా సర్గారి శ్రీనివాస్‌రెడ్డి, తలారి నాగరాజు, కోశాధికారిగా సూడే రాఘవ రెడ్డి, కార్యదర్శిగా బెంబడి హనుమంత రెడ్డిలను ఎన్నుకున్నారు. అదే విధంగా కార్యనిర్వాహక సంస్థ సభ్యులుగా బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మురళియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బెంబడి బుచ్చిరెడ్డి, పిసరి కృష్ణారెడ్డి, వెంకట్రామ్, సత్తిరెడ్డి, పోలీస్ గోవిందరెడ్డి, చెడ్డీ కృష్ణ, సరుగారి భీమ్‌రెడ్డి, నల్ల రామచంద్రారెడ్డి, రవికాంత్‌రెడ్డి, బసంత్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, భద్రయ్యాచారిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వారు పేర్కొన్నారు.

పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలి

దుండిగల్: రానున్న వర్షాకాలంలోపు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పలు అభివద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలంగా పరిష్కారం కానీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. డ్రైనేజీ మ్యాన్ హోల్స్, స్ట్రీట్ లైట్లు, వాకింగ్ ట్రాక్స్, రోడ్లు, నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తదితర పనులను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్‌ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

జగద్గిరిగుట్ట: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జైహింద్, లక్ష్మయ్య, విగ్నేష్, శ్రీధర్, చారి, రాజు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.